
# పండుగ



నేను అదిరిపడి నిద్రలేచి కూర్చున్నాను. సరిగ్గా అదే సమయానికి అందరిళ్ళల్లో పిల్లలు కెవ్వుమని ఏడుపు మొదలెట్టారు. మాశీనుగాడు కూడా యధాశక్తి ఇల్లెగిరేట్లు అరవసాగాడు. అసలేం జరిగిందో నాకోపట్టాన అర్థం కాలేదు. ఏదో కొంపలు మునిగిపోతున్నాంత శబ్దాలు, గుండెల మీద ఎవరో పరుగెడుతున్నట్లు అడుగుల చప్పుడు– ఇంక ఆలస్యం చేయకుండా తలుపు తెరుచుకుని గోపాల్రావ్ వాళ్ళింటికి పరుగెత్తాను. అప్పుడే గోపాల్రావ్ కూడా నిద్రమత్తులో వాళ్ళ పసివాడ్ని భుజానవేసుకుని వాళ్ళావిడతో సహా ఇంట్లో నుంచి బయటకు పరుగెత్తు కొచ్చాడు. సరిగ్గా అప్పుడే రంగారెడ్డి. శాయిరామ్, జనార్దన్ కూడా పరుగుతో వచ్చేశారు వాళ్ళపిల్లతో సహా.

"ఏమిటది? మన పక్కమేడలో గోడలు ఏమయినా కూలిపోతున్నాయా?" కంగారుగా అడిగాడు గోపాల్రావ్.

'ఆ– మీరు మరీనూ– మన కిటికీ పక్కన రోడ్డుమీద వినాయకుడి ఉత్సవం చేయటం లేదూ? వాళ్ళు మైకులో సినిమా రికార్డులు, పెట్టినట్టున్నారు! ఇవాళేగా వినాయకచవితి" అంది వాళ్ళావిడ రాజ్యలక్ష్మి.

మరికొద్ది క్షణాలు ఆ శబ్దాలు విన్నాక ఆమె చెప్పినమాట నిజమేనని అర్థమయిపోయింది మా అందరికీ.

ఆ స్పీకర్ మరీ కిటికీ పక్కనే ఉండడం వల్ల ఆ శబ్దాలు సినిమా రికార్డులోని ఆర్కెస్ట్రావని తెలీలేదు. ఈలోగా ఆర్కెస్ట్రా ఆగి పాట మొదలయి పోయింది.

"ఓ సుబ్బారావూ, ఓ అప్పారావూ, ఓ వెంకట్రావూ–"

చెవులు పగిలిపోతున్నాయ్.

"ఇదేమిటిలా అర్ధరాత్రిమైకు?" అడిగాడతను.

"అర్ధరాత్రేమిటి? తెల్లవారుజాము మూడయిపోయిందిగా! అందుకని పెట్టివుంటారు!" అందామె తేలికగా.

గోపాల్రావ్ వాళ్ళ బాబిగాడిని ఎత్తుకుని అటూఇటూ పచార్లుచేస్తూ నిద్రపుచ్చడానికి ప్రయత్నించసాగాడు.

వాళ్ళావిడ ఆరునెలల పసిగుడ్డుచెవిలో దూదిపట్టి, ఆమైక్ పాట వినబడకుండా చెవులకు గుడ్డచుట్టేసింది.

గోపాల్రావ్‌కి ఆ ఏరియా విఘ్నేశ్వర కమిటీమీద వళ్ళు మండిపోయింది.

"ఇప్పుడే వెళ్ళి ఆ స్పీకర్ డైరెక్షన్ మార్చమని చెప్పివస్తాను..." అన్నాడు రాజ్యలక్ష్మితో.

"వాళ్ళు మీ మాట వింటారా ఏమిటి మీ పిచ్చిగాని...." ఓ దుప్పటి చెవులమీద వేసుకుంటూ అందామె.

గోపాల్రావ్, బాబిగాడితో సహా, అందరం రోడ్డుమీద కొచ్చాము నలుగురు యువకులు గ్రామఫోన్ దగ్గరకూర్చుని బూతులు మాట్లాడుకుంటున్నారు.

"ఈ పాట పాడేప్పుడు జయమాలిన్ని సూడాల్రా– నీయవ్వ భలే చేసిద్ది"

"ఈరికార్డప్పుడా?" ఇంకొకడడిగాడు.

"అవ్–"

"ఇస్కిమాకీ– గప్పుడే నేను సిగరెట్ తాగనికి బయటికెళ్ళినా–"

"కల్‌ఫిర్ జాయంగే–చల్తే? ఇస్కీ– మాకీ– ఛోడ్‌నా నై– ఉత్‌నా జబర్దస్త్– బతాతీరే–" పాట అయిపోయింది.

మరో రికార్డు తీశాడు మైక్ కుర్రాడు.

"ఏం పాటది?"

"ఇదిగో తెల్లచీరా– ఇవిగో– మల్లెపూలూ......"

"ఊ ఊ ఊపెయ్ నీయవ్వ"

పాట మొదలయిపోయింది.

గోపాల్రావ్ వాళ్ళ దగ్గరకు నడిచాడు. రోడ్డుకడ్డంగా పెద్ద స్టేజీ! దాని మీద వినాయకుడు చాలా పెద్దబొమ్మ.

"ఇదిగో! కొంచెం ఆ స్పీకర్ అటునుంచి ఇటు పక్కకకు తిప్పిపెడతారా"

వాళ్ళందరూ అతనివంక పిచ్చివాడిని చూసినట్లు చూశారు.

"ఎందుకు?"

"అది సరిగ్గా మా కాలనీ కెదురుగ్గా ఉంది. ఇంట్లో చెవులు పగిలిపోతున్నాయి."

ఇద్దరు వెకిలిగా నవ్వారు.

"కిటికీ తలుపులు మూసుకోండ్రి!"

"మూసుకున్నా లాభంలేదు"

"స్పీకర్ తిప్పనికి కాదువయ్యా!"

"అంటే? ఇవాళంతా ఆ వెధవ పాటలమొత భరించాల్సిందేనన్నమాట!" కోపంగా అన్నాడు శాయిరామ్.

"ఇయాలా? ఇయాలేమిటి? తొమ్మిద్దినాలుంటదిది"

"అంటే ఆ స్పీకర్ మరోవేపుకి తిప్పరన్నమాట–" సీరియస్‌గా అడిగాడు రంగారెడ్డి.

"ఛల్ చల్‌మియా! నీకోసం స్పీకర్ తిప్పనికి నువ్వేం మినిష్టరువా? ఎళ్ళెళ్ళు"

కోపం అణచుకుని అక్కడనుంచి వచ్చేశాము.

"రేప్రొద్దున్న పోలీస్ కంప్లెయింట్ ఇద్దాం" అన్నాడు గోపాల్రావ్.

అరగంట గడిచిపోయింది. రెండు చెవ్వుల్లో దూదిపెట్టుకుని పడుకున్నాము. వంటింటివేపు నుంచీ చెవులుపగిలేలా శబ్దమయింది. మళ్ళీ పిల్లలు లేచి కెవ్వుమని ఏడుపు మొదలెట్టారు.

"హేకృష్ణా, ముకుందా, మురారి–"

"ఇటు పక్కవీధిలో ఇంకో వినాయకుడిని పెట్టినట్లున్నారండీ...." అంది మా ఆవిడ.

రెండు మైకులు పాటలూ కలబడిపోయినయ్.

"హే కృష్ణా! ఇదిగో తెల్లచీరా– ముకుందా ఇవిగో మల్లెపూలు– మురారీ ఇదిగో తెల్లచీరా– జయకృష్ణా– ఇదిగో మల్లె– ముకుందాపూలు మురారీ"

"అబ్బా!" రెండు చేతుల్లో తల పట్టుక్కూర్చున్నాను.

రెండు రికార్డులూ ఒకేసారి అయిపోయేసరికి మొఖం పగిలిపోయేటంత నిశ్శబ్దం.

హఠాత్తుగా అంత నిశ్శబ్దం భరించలేక పిల్లలు భయపడిపోయి మళ్ళీ ఏడుపు ప్రారంభించారు.

కొద్దిక్షణాల్లో మళ్ళీ ఒకేసారి రెండు రికార్డులు ప్రారంభమయ్యాయి అప్పుడుగానీ ఏడుపు ఆపలేదు వాళ్ళు.

"ఏడుకొండలస్వామీ– ఏమిటంటే ఏమి చెప్పను– ఎక్కడున్నావయ్యా– ఎందుకంటే ఎలా చెప్పను– ఎన్నిమెట్లెక్కినా– అబ్బా– నిద్దరొస్తుందండీ– కానరావేమయ్యా తొలిరాత్రి– ఏడుకొండలసామీ రాదంట– ఏడుకొండల స్వామీ– ముద్దులాటాలంట– సుద్దులాడాలంట– ఆశాకమంటూ ఈ కొండ శిఖరమ్మునా– అబ్బ– వద్దండీ ఊ– ఏడుకొండలసామీ– వద్దంటే? ఎక్కడున్నావయ్యా– మ్యావ్ మ్యావ్ అందాల ఓ పిల్లీ– ఏచోటాగాంచినా నీవుండువదురే– అబ్బా– ఏమిటో నీమాయా ఎందుకండీ– తెలియకున్నామయ్యా అందుకే అని ఎలా చెప్పను."

నేను నెత్తిమీద తలడగ విసిరికొట్టి పక్కమీదనుంచి లేచి కూర్చున్నాను. టైము అయిందయింది. ఆ చుట్టుప్రక్కల అందరిళ్ళల్లోనూ లైట్లు వెలగటం కనబడుతూనే ఉంది. సాధారణంగా ఆరింటి వరకూ ఏ ఇంట్లోనూ లైటు వెలగడం నేనింతవరకూ చూళ్ళేదు.

అంటే నాతోపాటు ఆ చుట్టు ప్రక్కలాళ్ళందరినీ కూడా ఆ మైకులు నిద్ర లేపేశాయన్న మాట.

మరికాలనీ వాళ్ళందరూ ఆ మైకు వాళ్ళను మందలించరేం? రెసిడెన్సియల్ ఏరియాలో అంత శబ్దాలు చేయడానికి ఎలా అంగీకరిస్తున్నారు?

కోపంగా లేచి బయటికొచ్చాను. అప్పటికే రంగారెడ్డి, శాయీరాం, జనార్ధన్, యాదగిరి, గోపాల్రావ్, రాజేశ్వరి కాలనీలో నిలబడి సీరియస్‌గా చర్చించుకుంటున్నారు.

"ఇలా ఊరుకుంటే లాభంలేదు. కాలనీ వాళ్ళందరం కలసివెళ్ళి గొడవచేస్తేగానీ ఆమోత ఆగదు. పదండి! అందరినీ తీసుకెళదాం–" అన్నాడు గోపాల్రావ్.

నేనూ వాళ్ళతోపాటు మా పక్కింటికెళ్ళాను. గది కిటికీ దగ్గరే కూర్చుని ఆఫీస్‌ఫైల్స్ చూసుకుంటున్నాడు భుజంగరాజు.

మమ్మల్ని చూసి "హలో! ఏమిటిలా వచ్చారు? మళ్ళీ ఏమయినా మీటింగా?" భయంగా అడిగాడు.

"అబ్బే! కాదు!"

"సంతోషం! మరి ఇంత పొద్దున్నే ఎందుకులేచారు? సాధారణంగా ఎనిమిదివరకూ లేవరుకదా?" చిరునవ్వుతో అడిగాడు.

"మేము లేవలేదయ్యా! ఆ వెధవమైకులు లేపేసినయి" చెప్పాడు రంగారెడ్డి.

"ఓ స్పీకర్లా? సంతోషం"

"సంతోషమా, వల్లకాడా? ఆపాడు మోత మీక్కూడ పిచ్చెక్కించటం లేదూ?" చిరాగ్గా అన్నాడు శాయీరాం.

అతను నవ్వాడు.

"అదా! అది సరిగ్గా వినిపించదు కదా మా హైదరాబాద్ వాళ్ళకి"

"అంటే- మాది హైదరాబాద్ కాదేమిటి?"

"మీరు ఒక తరం నుంచే ఉన్నారు. మేము ఎనిమిది తరాలుగా ఇక్కడే ఉంటున్నాం. అంచేత ఈ లౌడ్ స్పీకర్ల మోతకు వంశపారంపర్యంగా మాకు చెవుడొచ్చేసింది. అంచేత ఎంత పెద్దశబ్దాలయినా ఎప్పట్నుంచో హైదరాబాద్‌లో ఉండేవాళ్ళనేమీ చేయలేవు."

"అంటే ఇప్పుడా స్పీకర్ మోత వినిపించడం లేదా?"

"ఎక్కడో దూరంగా హిమాలయాల్లో ట్రాన్సిస్టర్ మోగుతున్నట్లుంది అంతే! మీకు బాగా వినబడుతుందా?" ఆత్రుతగా అడిగాడతను.

"వినబడమా? చెవులు పగిలిపోతున్నయ్!"

"సంతోషం! ఇప్పుడేం పాటవస్తోంది?"

మాకు కోపం ముంచుకొచ్చింది గానీ తమాయించుకున్నాము. ఇంక అతనితో మాట్లాడటం అనవసరమని బయటకు నడిచాము.

"ఇదిగో- మీరెవరయినా ఆ స్పీకర్ వాడి దగ్గరికెళ్తే 'ఇదిగో తెల్లచీరా' పాటకొంచెం గట్టిగా సౌండ్ పెట్టవేయమని చెప్పండి-"

ఇంకో ఇంటి దగ్గరకు చేరుకున్నాం.

శ్రీనివాసరావ్ బయటకొచ్చాడు పళ్ళు తోముకుంటూ.

"చూశారా ఆమోత!" అడిగాడు గోపాల్రావ్.

"మూడింటినుంచి చూస్తూనే ఉన్నాను."

"అందరం కలసి ఆ గొడవ ఆపించలేమూ?"

"మనమా?" నవ్వుతూ అడిగాడు.

"అవును-ఏం?"

"ఆ ఉత్సవం చేసేదెవరనుకుంటున్నారు? ఈ ఏరియాలోని గుండాలు. వాళ్ళు మనమాట వింటారా?"

"అయితే ఈ తొమ్మిదిరోజులూ- ఈ నరకం అనుభవిస్తూనే ఉండాలా?"

"నేనందుకే ఓ ప్లాన్ వేశాను-"

"ఏమిటది? చెవులలో దూది పెట్టుకోవడమా!"

"అదికాదు. అదికూడా పని చేయడం లేదిప్పుడు! వరంగల్ రోడ్డులో ఉప్పల్‌కి అవతల ఊరికి సంబంధం లేకుండా మా ఫ్రెండొకడు ఉంటున్నాడు. ఈ వారం రోజులూ వాడింటి కెళుతున్నాను- దాంతో శని వదిలిపోతుంది"

"అంతేగాని ఆమైకులను ఆపే ప్రయత్నం చేయరన్నమాట!"

"వృథా ప్రయాస- అదీగాక గూండాలతో వ్యవహారం- మనకెందుకు చెప్పండి."

"అందరూ ఎవరికివారు ఏదోరకంగా సర్దుకుపోయేవారే. థూ! దొంగనాకొడుకులు" అన్నాడు యాదగిరి.

మళ్ళీ రెండుక్షణాలు నిశ్శబ్దం.

వెనుకవేపు రోడ్‌లో ఉన్న నర్సింగ్ హడావుడిగా గోపాల్రావ్ దగ్గరకు వచ్చాడు.

"నీయవ్వ– ఫాల్తూనా కొడుకులు. మనం ఆ మోతకి బతకాల్నా, సావాల్నా? పసిపిల్లలు ఒకటే ఏడుపు" మాతో అన్నాడతను.

గోపాల్రావ్‌కి ఆనందం కలిగింది. మాలాగా బాధపడుతున్నవాడు ఒక్కడేనా దొరికాడు.

"నేనూ అదే మొత్తుకుంటున్నాను. మనముగ్గురికీ తప్పితే ఇంకెవరికీ పట్టినట్టులేదు" అన్నాడు గోపాల్రావ్.

"మీరు నాస్తాగట్టా చేసి తయారుండండ్రి! నేనూ చేసొస్తా! నీయవ్వ ఈమైక్ కిరికిరి ఎట్లఖతం కాదో సూద్దాం!" అన్నాడు నర్సింగ్–.

"ఓ మేము అరగంటలో రడీ అయిపోతాం!" ఆనందంగా అన్నాడు గోపాల్రావ్.

అందరం విఠల్రావ్ ఇంటికి చేరుకున్నాం.

"ఏమిటి సంగతి?" అడిగాడు విఠల్‌రావు.

"అదే– ఆ మైక్ కిరికిరి బంద్ చేయిద్దాంనడు" అన్నాడు యాదగిరి.

"ఎందుకు?"

"అలా వూరుకుంటే ఈ తొమ్మిది రోజుల్లో ఆ రెండుమైకులూ కలిసి మనల్ని శవాలు చేసేస్తయ్–" గోపాల్రావ్ అందుకున్నాడు.

"కానీ ఆ పాటలు మంచిగా ఇనొచ్చుకదా" ఆనందంగా అన్నాడు విఠల్‌రావ్.

"అంత మోతపెడుతూంటే ఆ పాటలు ఎంజాయ్‌చేస్తావా?" ఆశ్చర్యంగా అన్నాడు యాదగిరి.

"ఎంతమోతగున్న సరే– నాకు పాటలంటే చాలా ఇష్టంభయ్! రేడియోలో రోజుకీ రెండు పాటలయినా నాపేరు మీద జనరంజనిలో ప్రసారం జేస్తుంటారు. ఇనలే?" అందరం మొకాలు చూసుకున్నాము. తిరిగి అన్నాడతను. "అన్నింటిలోకి సామజవరగమనా భలే ఇష్టం! అబ్బ! ఎన్నిసార్లయినా గానీ ఇంటా!"

సరిగ్గా అప్పుడే మళ్ళీ రెండు మైకులలో పాటలు తగులుకున్నాయి.

"సామజవరగమనా– సామజవరగమనా– సామజవరగమనా దూరన దూరన తారాదీపం– సాధుహృత్తర సాధ్యకాలాతీత విఖ్యాత– భారమయినా గుండెలో ఆరనితాపం– సామజవరగమనా– ఆరిమోదు చేరరాదు– ఆశాదీపం సామనిగమ జసుధామయ– ఆతారాదీపం ఈతీరని తాపం– గాన విచోణ గుణశీల వికసించిన మందారం నీవయ్యారం–

దయాలవాల మాపాలయ సామజవరగమనా– విరియని పసికందు మొగ్గ– నీ హృదయం– మనసులోని మధురమయిన– ఆమనికోయిల ఇలా నా జీవనవేణువు లూదగా మరీమరీ తిరిగేను మతిమాలిన తుమ్మెదను– మధురలాలసల దూరాన దూరాన– మధుపలాలసల– తారాదీపం– పెదవిలోని మధువు దూరాన వెత్తముపుని– తారాదీపం– జతకు చేరకు సరిగా– నిసాగని– మగ–గమ”

యాదగిరి కోపంగా విఠల్‌రావ్ వేపుచూశాడు, విఠల్‌రావ్ మొఖం మాడిపోయింది.

“ఇను, నీకిష్టమన్నావుగా మనసారా ఇను. పదహో” అంటూ గోపాల్రావ్ చేయిపట్టుకుని బయటికీడ్చుకొచ్చాడు.

అందరం పందిట్లోని మైక్ సిస్టం దగ్గరకొచ్చాము.

“ఇగో–ఈ సౌండ్ తగ్గిస్తారా! లేదా” కోపంగా కుర్రాళ్ళనడిగాడు రంగారెడ్డి. వాళ్ళు అతనివంక నిర్లక్ష్యంగా చూశారు.

“కమిటీ వాళ్ళనడగాలి. వాళ్ళు తగ్గించమంటే తగ్గిస్తాం”

“ఎవరు కమిటీ వాళ్ళు?”

“రాములుదాదా, లింగన్నగౌడ్‌దాదా, రెడ్డీసాబ్.”

“సరే– వాళ్ళనే అడుగుదాం పద” అన్నాడు గోపాల్రావ్.

ఇద్దరూ రాములు దాదా ఇంటికి చేరుకున్నారు.

“రాములున్నాడా.” ఇంటిముందు కూర్చున్న ఓ ముసలతన్ని అడిగాడు గోపాల్రావ్.

“ఎవళ్ళు మీరు?”

“మేము ఆ పక్కనే కాలనీలోనే ఉంటాం!”

“ఏంది పని ఆడితో?”

“మాట్లాడాలి!” అన్నాడు యాదగిరి.

“మాట్లాడాల్నంటే మద్యాహ్నం పన్నెండు గంటలకు రాండ్రి”

“ఇప్పుడింట్లోలేడా?”

“ఉన్నడుగానీ పదకొండు గంటలగ్గాని లేవడు.”

చేసేదిలేక అందరం కాలనీ తిరిగివచ్చాము.

ఈసారి రెండు హిందీ రికార్డులు కలబడ్డాయి.

“కభి అల్విదనా కహెనా– ఓహ మారీ టక్కర్ హై– కభి అల్విద నాకహెనా”

“పన్నెండింటికి వస్తాను– తయారుండు” అని చెప్పివెళ్ళిపోయాడు రంగారెడ్డి.

మధ్యాహ్నం పన్నెండింటికి మళ్ళీ అందరం రాములింటికెళ్ళాం.

“గిప్పుడే వినాయకుడి పూజగురించి పోయిండు” అన్నాడు ముసలాడు.

ఇద్దరు రికార్డులు మోగేచోటకు చేరుకున్నారు.

"రాములు వచ్చిండా ఈడకి?" ఓ యువకుడినడిగాడు విఠల్‌రావు.

"వచ్చిండు- అగో ఆ బార్‌లో ఉన్నాడు."

"బార్‌లోనా?"

"అవ్!"

"ఆడెందుకున్నాడు?"

అతను నవ్వాడు "బార్ల ఎందుకుంటారో ఎరికిలేదా?"

అందరూ బార్‌లోనికి నడిచారు.

ఎదురుగ్గానే ముగ్గురు వ్యక్తులు కూర్చుని రమ్ తాగుతున్నారు.

"వినాయకుడి ఉత్సవకమిటీ నెంబర్లు మీరేనా?" అడిగాడు యాదగిరి.

"నువ్వెవళు?"

"మేము ఈ కాలనీలోనే ఉంటాం!"

"ఏం గావాల్నీకు?"

"మా ఇళ్ళల్లో ఆ స్పీకర్ మోతకు బేజారయిపోతున్నాం. వాటిడైరక్షన్ అయినా మార్చండి- లేదా జరసౌండ్ అయినా తగ్గించండ్రి!"

"మీరంతా హిందువులేనా?" అడిగాడతను రమ్‌గ్లాస్ ఎత్తితాగుతూ.

"అవ్- ఏమట్ల అడిగినవ్?"

"హిందువులయుండి పండగకు లొల్లిపెడతార్వయ్యా- మనదేవుడి పండగ్గాదిది?"

"మనపండగేగాని- దేవుడి మొఖాన్ని స్పీకర్లుపడేసి- మనం బార్లల్లో కూసుంటే ఆవతలోళ్ళకి ఎంత తక్లీఫ్ ఉంటుంది?" కోపంగా అన్నాడు యాదగిరి.

"ఇగో- ఎక్కువ తక్కువ మాట్లాడకండ్రి- ఆ సౌండ్ గట్టనే ఉంటది. ఏం జేస్కుంటారో చేస్కోండ్రి" పొగరుగా అన్నాడు.

యాదగిరి ఏదో అనబోయాడుగానీ గోపాల్రావ్ అతనిచేయి పట్టుకుని బయటకు లాక్కొచ్చాడు.

"వాడితో కిరికిరి ఎందుకు మనకి- ఎక్కువ మాట్లాడితే మనల్ని ముగ్గురూ కలిసి ఉతికేస్తారు" అన్నాడు సమాధానపరుస్తూ.

"అట్లాని ఈ దరిద్రం తొమ్మిదిరోజులెట్లనయ్యా భరించేది?"

"పోలీస్‌రిపోరిస్టే- దెబ్బకు దారికి వస్తారందరూ" అన్నాడు శాయీరామ్.

అందరం కాసేపు తటపటాయించాముగానీ అంతకంటే గత్యంతరం లేదని పోలీస్‌స్టేషన్‌కి బయల్దేరాము.

"ఏం గావాలి?" అడిగాడు హెడ్‌కానిస్టేబుల్ చిరాగ్గా మా వంకచూస్తూ.

"కంప్లైయింట్ ఇవ్వడానికొచ్చాం"

"ఎవరు మీరు?"

"అదిగో! ఆ నిర్భయ్‌నగర్ కాలనీవాళ్ళం."

"ఓహో మీరేనా– సరే సరే– తలవూపుతూ అన్నాడు "ప్రతిచిన్న విషయానికి కిరికిరి పెట్టేది మీకు అలవాటయిపోయిందని మా పాత ఇన్‌స్పెక్టర్ చెప్పాడ్లే! ఇంతకూ ఇప్పుడు ఏ విషయం గురించి కంప్లైయింట్ ఇవ్వడానికొచ్చారు?"

"ఆ వీధి వినాయకుడి దగ్గర స్పీకర్లు పెట్టి మా కాలనీ వాళ్ళందరికీ న్యూసెన్సు చేసేస్తున్నారు. పిల్లలు రాత్రుళ్ళు నిద్రపోవడం లేదు. మాక్కూడా పిచ్చెక్కిపోతోంది."

"పిచ్చెక్కితే ఎర్రగడ్డ పోవాలి? పోలీస్‌స్టేషన్ కొస్తే మేమేం జేస్తాం?"

"అంటే ఆ స్పీకర్స్ గొడవతో మీకేమీ సంబంధం లేదన్నమాట–"

"లేదని ఎవరన్నారయ్యా! ఇలాంటి పిచ్చి కామెంట్స్ చేయకండి! వాళ్ళకు లైసెన్స్ ఇచ్చింది మా అసిస్టెంట్ కమిషనర్ సాబేగదా! సంబంధం లేదని మేమెట్లా అంటాం?" అదే! అదే మేమూ అదిగేది! చుట్టుపక్కలుండే ఫ్యామిలీస్‌కి ఎంత తక్‌లీఫ్ అవుతుందో చూడకుండా పర్మిషనెట్లా ఇచ్చారు" గట్టిగా అరచాడు రంగారెడ్డి. హెడ్ కానిస్టేబుల్‌కి కోపం వచ్చింది.

"ఇంకోసారి అలా అరచారంటే మర్యాదగా ఉండదు! ఆ!" అంటూండగానే లోపల్నుంచి ఇన్‌స్పెక్టర్ వచ్చాడు కోపంగా.

"ఏవడాడు అరిచిందిప్పుడు?" అన్నాడు మా వంక చూస్తూ.

"నేను" అన్నాడు రంగారెడ్డి.

"ఇంకోసారి ఆరచావంటే లోపటవేస్తా–" పొగరుగా అన్నాడు.

దాంతో రంగారెడ్డికి కోపం మరింత పేట్రేగిపోయింది.

"ఏమిటి? జైల్లోవేస్తావా? ఏంతప్పుచేశామని జైల్లోవేస్తావయ్యా? వేస్తే గాజులు తొడుక్కుని కూర్చుంటామనుకున్నారా?"

సరిగ్గా అప్పుడే ఓ గిరిజాల జుట్టువాడిని ఈడ్చుకొచ్చి లోపలకు తోశారు కానిస్టేబుల్స్. వాడువచ్చి ఇన్‌స్పెక్టర్ ముందు నేలమీదపడ్డాడు. "వీడేసార్– చెరుకురసం బండివాడు"

ఇన్‌స్పెక్టర్ వాడిని కాలితో ఒక్క తన్ను తన్నాడు.

"ఏరా కొడకా! మా పోలీసోళ్ళు చెరకురసం తాగి డబ్బివ్వకుండా పోతున్నారని ఈనాడు పేపరోడి ఇంటర్వ్యూలో రాయిస్తావా?"

"అవ్‌సార్! మీరు పైసలిస్తున్రా మరి?" కిందనుంది లేచి ధైర్యంతో ఆడిగాడువాడు.

"నీయమ్మ– సాలే! నీకా రోడ్‌మీద బండిపెట్టటానికి లైసెన్స్ ఉందా? నీ బండి గురించి ఆ రోడ్ ఇరుకుయిపోయి ఎన్ని యాక్సిడెంట్లు అయినాయి బే! అందులో ఆరుగురు అక్కడిక్కడే చచ్చిన్రు! అయినాగానీ నీ బండి తియ్యమని నేనెప్పుడూ జెప్పలే. ఇంత మదద్‌జేస్తే– గన్నారస్‌కి పైసలిమ్మంటావ్‌రా" అంటూ ఇంకో తన్ను తన్నాడు.

"ఇదిగో హెడ్‌కానిస్టేబుల్! ఈడికాళ్ళూ చేతులూ ఇరగ్గొట్టి నగ్జలైట్ ఎన్‌కౌంటర్‌లో దొరికాడని ఆ న్యూస్ పేపరోడికే ఫోన్‌జేసి చెప్పు! ఎవడితో చెప్పుకుంటాడో చూద్దాం"

అందరం భయభ్రాంతులయిపోయాం. అంతవరకూ మాలో రంగారెడ్డి వల్ల పొంగి పొరలిన కోపం నీళ్ళు కారిపోయింది. వాడిని లోపలకు ఈడ్చుకెళ్ళిపోయారు కానిస్టేబుల్స్. ఇన్స్‌స్పెక్టర్ మళ్ళీ రంగారెడ్డి దగ్గరకొచ్చాడు.

"ఆ! నువ్వేంటంటావ్? జైల్లో వేస్తే గాజులు తొడుక్కుని కూర్చోనంటావ్? అంతేనా" రంగారెడ్డి తడబడ్డాడు. "ఏదో కోపంలో అనేశానండీ–"

"నువ్వు ఏదయినా తప్పు చేస్తేనే జైల్లో వేయాలని రూలుందా?"

"లేదని ఇప్పుడే తెలిసిందండి"

"అయితే సక్కగ బయటకు పొండి! ఇంకోసారి ఈ ఏరియాలో కనిపించొద్దు."

"అలాగే సార్"

అతను కొంచెం శాంతించాడు.

"ఇక్కడి కెందుకొచ్చిన్రు మీరిప్పుడు?"

అంతా వివరించాడు శాయీరామ్.

"అవ్– వినాయకుడి పండుగకు మైక్, స్పీకర్లు బరాబర్ బజాయిస్తరు. వద్దననికి మీరెవరు?"

"ఆ స్పీకర్ బాధకు తాళలేక మీ దగ్గరకొచ్చినం అది ఆపుజేయిస్తారా లేదా? లేదంటే అసిస్టెంట్ కమీషనర్ ఆఫ్ పోలీస్‌కి కంప్లెయింట్ చేస్తాం–" అన్నాడు యాదగిరి కోపం అణచుకోలేక.

"ఏయ్! ఇగో– ఎక్కువ తక్కువ మాట్లాడిన్రంటే వినాయకచవితి పూజలకు మీరు అడ్డుతగులుతున్రని మతకల్లోలాల సెక్షన్ కింద కేస్ బుక్‌చేసి లాకప్‌ల ఏస్త! సమజయిందా?"

ఏం చేతో తెలీదుగానీ ఆమాట చాలా పవర్ఫుల్‌గా అర్థమయిపోయింది మాకు. నిశ్శబ్దంగా వెనక్కు తిరిగి బయటకు నడుస్తోంటే ఇన్‌స్పెక్టర్ తిట్లు వినబడుతూనే ఉన్నాయ్.

"ఫాల్తూ కొడుకులు– ఆ వినాయక పూజలకు చందాలిచ్చేడిది ఈళ్ళే– బంద్ జేయింపించమని కిరికిరి చేసెడిది ఈళ్ళే– ఇగో త్రీ నాట్ త్రీ– ఇంకోసారొస్తే అందరినీ లోపటేసేయ్."

మాకు వళ్ళు మండిపోయింది ఆ మాటలకు. చందాలు మేము ఇచ్చినమాట నిజమేగాని ఇయ్యకపోతే ఆ ఏరియా గూండాల చేతుల్లో ఏమైపోతామో మాకు తెలుసు.

అసిస్టెంట్ కమిషనర్ ఆఫీస్ దగ్గర రైటర్ మమ్మల్ని బయటే ఆపేశాడు.

"ఏం గావాలి?" కథంతా చెప్పబోయాంగానీ అతను వినిపించుకోలేదు.

"కంప్లెయింట్ రాసివ్వండి."

అందరం రకరకాల ఇంగ్లీష్ ఉపయోగించి కంప్లెయింట్ రాసిచ్చాం- చూస్తూనే చిరాకుపడ్డాడు.

"మీకేం దమాకున్నదా లేదా? దీని మీద స్టాంప్ కొని అంటియ్యాల."

స్టాంప్ కోసం అరగంటసేపు ఆటోలో తిరిగి తీసుకొచ్చాడు యాదగిరి. అది అంటింది మళ్ళీ రైటర్ కిచ్చాం. అప్పుడు చదివాడతను. "ఏమది స్పీకర్స్ గురించి కంప్లెయింటా? థూత్" అంటూ మా మీదకు విసిరేశాడా కాగితం.

"అదేంటండీ? ఏమయింది?"

"మేమే కదయ్యా ఆ స్పీకర్స్‌కి పర్మిషన్ ఇచ్చింది- మళ్ళీ మేమే కంప్లెయింట్ ఎట్లా తీసుకుంటాం?"

"అంటే మేమీ స్పీకర్స్ శబ్దాలతో పిచ్చెక్కి ఛావాల్సిందేనా"

"ఇదిగో- ఇంకోసారిలి- ఛావాల్సిదేనా' అన్నావంటే సూసైడ్ ఎటెంప్ట్ కేస్ కింద జైల్లోవేస్తాం-"

ఆ మాటతో యాదగిరి కోపం పెరిగిపోయింది.

"ఏమి! జైల్లో ఏస్తావ్? ఏయ్ సూద్దాం మళ్ళా"

మా గొడవంతా చూసి ఓ ఇన్‌స్పెక్టర్ బయటికొచ్చాడు.

"ఏయ్ ఏమిటిక్కడలొల్లి?"

రైటర్ జరిగిందంతా రెండుముక్కల్లో చెప్పాడు.

"సర్లే- మీరుపొండి! కానిస్టేబుల్‌ని పంపిస్తాం-"

మేము కాలనీ చేరుకున్న అరగంటకే ఓ కానిస్టేబుల్ వచ్చాడు మోపెడ్‌మీద. అందరం కలసి అతనితోపాటు వినాయకుడి విగ్రహం దగ్గరకు చేరుకున్నాం.

రికార్డులు వేస్తోన్న దాదాతో అయిదు నిమిషాలు మాట్లాడాడతను. తరువాత ఇద్దరూ కలసి ఎదురుగ్గా ఉన్న బార్లోకెళ్ళారు.

గంటసేపటి తర్వాత తూలుతూ బయటికొచ్చాడతను. మోపెడ్ స్టార్ట్‌చేసి, మమ్మల్నిచూసి దగ్గరకు రమ్మని సంజ్ఞ చేశాడు.

"ఇగో– ఇది దేవుడి గురించి చేస్తున్న పూజ! మీరుకూడా సాయంజేయాలిగానీ కిరికిరి పెడితేఎట్ల? సచ్చినాక స్వర్గానికి ఎళ్ళాలని లేదా?" అనేసి వేగంగా వెళ్ళిపోయాడు. అతని వెనుకే వచ్చినిలబడ్డ రాములు మమ్మల్ని చూసి నవ్వుతున్నాడు హేళనగా.

కోపం అణచుకొని కాలనీలోకి నడిచాం.

రాత్రి గొడవ ఇంకా ఎక్కువయిపోయింది.

రికార్డులకు తోడు, బూతు రికార్డు డాన్సులు– వాటిని చూడ్డానికి విరగబడ్డ జనం– వాళ్ళకేకలు – ఈలలు.

పన్నెండింటి వరకూ కంటిమీద కునుకులేదెవ్వరికి.

ఉండండి యాదగిరి "ఫాల్తునా కొడుకులు" అని తిడుతున్నాడు గట్టిగా. వాళ్ళు తండ్రికి ఆ రికార్డుల శబ్దం వల్ల బ్లడ్‌ప్రెజర్ పెరిగిపోయిందట. ఒంటిగంటకు రికార్డు మోగటం ఆగింది. అయితే తెల్లారుజామున నాలుగింటికి మళ్ళీ మొదలయినయ్! ఉదయం ఎనిమిదింటికి అందరినీ బూతులు తిట్టుకుంటూ తండ్రిని హాస్పిటల్‌కు తీసుకెళ్ళాడు యాదగిరి.

గోపాల్రావ్ ఆఫీస్‌కెళ్ళి సాయంత్రం ఇంటికి వచ్చేసరికి అతనికోసమే ఎదుర్చూస్తున్నా డతను.

"పదండి– ఎమ్మెల్యేగారింటికెళ్దాం" అన్నాడు హడావుడిచేస్తూ.

"ఎందుకు? ఈ మైక్‌ని ఆపేపవర్ ఆయనకెక్కడిది?" అన్నాడు గోపాల్రావ్.

"ఎందుకు లేదు? ఆయన పోలీస్‌స్టేషన్‌కి ఒక్కఫోన్ కొడితే ఛట్‌మని బంద్ అయిపోద్ది!"

"సరే! అయితే పదండి!"

అందరూ ఎమ్మెల్యే శంకర్‌దాదా గారింటికి చేరుకున్నాము.

అప్పుడే ఎక్కడికో బయల్దేరుతున్నవాడల్లా మమ్మల్ని చూచి ఆగాడు.

"నమస్కారం సార్!"

"నమస్తే– నమస్తే– నమస్తే– ఎవరు మీరు?"

"మేము ఈ పక్కకాలనీ వాళ్ళం సార్! మర్చిపోయినట్లున్నారు! మిమ్మల్ని సహాయం కోరదామని వచ్చాము?"

"ఏమిటది?"

"మా ఇళ్ళపక్కకి రెండువేపులా రెండు విఘ్నేశ్వరులను పెట్టి పూజలు చేస్తున్నారు కదండీ! వాటి తాలూకూ మైక్‌లు రాత్రింబగళ్ళు మా చెవులు పగలకొట్టేస్తున్నాయండీ!"

"అయితే చెవి డాక్టరు దగ్గరకెళ్ళాలివయ్యా! నేనేం చేస్తాను?"

"జర ఇనండి సార్! ఈ ఫాల్తు రికార్డుల శబ్దానికి మా ఫాదర్ బ్లడ్ ప్రెజర్ ఎక్కువయింది. హాస్పిటల్లో చేర్చాల్సి వచ్చింది–"

"మరి ఇంకేం కావాల్నయ్యా! ముసలాయనను ఈ తొమ్మిద్దినాలూ దవాఖానలోనే ఉండనీ! కావాల్నంటే డాక్టర్‌కి నేను ఫోన్జేసిచెప్తా! డిశ్చార్జ్ గట్టా ఇయ్యద్దని!"

"అయితే మరి మా సంగతేమిటి సార్?"

"ఎట్లాగట్లా భరాయించాల్నయ్యా! ఆ పూజలు చేస్తున్నది ఎవరికోసం? మన నియోజనకవర్గంలో ఓటర్లు సుఖంగా ఉండాల్ననేగదా!"

"కానీ ఎవళ్ళింట్లోవాళ్ళు వినాయకుడిని పెట్టి పూజలు చేస్తున్నాం గద్సార్. మళ్ళీ వీదుల్లో వినాయకుడెందుకు?" ఆ ప్రశ్నతో శంకర్‌దాదాకు కోపం వచ్చింది.

"మీకేం దమాకున్నదా లేదా? ఇంట్ల దేవుడున్నాడని గుడికెళ్ళటం మాన్తారువయ్యా! తిరుపతీ, కాశీపోయేటోండ్లు పాగల్‌గాళ్ళా? గిసంటి పండగల్లోనే మన పార్టీవర్కర్లు ఖుషామత్ చేసుకోనికి ఛాన్సుంటది. సమజయినాది?"

"అంటే వినాయకచవితి పండగ పార్టీ వర్కర్ల ఖుషామత్ గురించి చేస్తున్రా?" రోషంగా అడిగాడు యాదగిరి.

"అవ్ మళ్ళా! ఇందుల రహస్యమేమున్నది? ఖుల్లమ్ ఖుల్ల జెప్తున్న! ఈ ఎలక్షన్లు అయిదేండ్లకొక్కసారి ఆస్తయ్. మళ్ళా ఈ అయిదేండ్ల వరకు మా వాళ్ళెట్ల బ్రతకాల? ఇగో– గిసంటి పండగలు, గొప్పోళ్ళ సావులు, గిట్లా వచ్చినప్పుడు చందాలు గిట్టవసూల్జేసుకుని మనిషికి ఐదారు లక్షలు సంపాదించుకొని గుజరాయిస్తుంటరు. గిదంతా మనం సూసీ సూడనట్లు పోవాలె! అంతా మనపోరగాండ్రే కదా! అంతేగాని ఆ విగ్రహాలు రోడ్డుకి అడ్డంగా ఎందుకు పెట్టిన్రు, రోడ్‌మీద ష్యామాన్యాలేసి రోడ్ ఎందుకు బ్లాక్‌చేసిన్రు, స్పీకర్లల సినిమా పాటలెందుకేస్తున్రు అంటూ కిరికిరి పెడితే వచ్చే ఎలక్షన్ల పని ఎవళుజేస్తరు? దొంగోట్లు ఎవళ్ళేస్తరు? ఇయన్నీమంచిగా ఆలోచించాలె! వెళ్ళండి! ఈ నాల్గుదినాలూ కండ్లూ, చెవులూ మూసుకోండ్రి! పోండ్రి!"

అప్పుడే రాములు దాదా వచ్చాడక్కడికి.

"అవ్‌రా రాములూ? ఎట్లా నడుస్తున్నది?"

"దుకాణాలోళ్ళందరూ మనం అడిగినంత చందా ఇస్తున్రు సార్! ఆ రాకేష్‌మాల్ దుకాణం ఓనరు మాత్రం నకరాలు జేస్తుండు–"

"గట్లన? ఆడి మొఖంమీద యాసిడ్ కొట్టండ్రి! ఆడిపెండ్లాం మీద కూడా కొడతామని బెదిరించండ్రి! సుథరాయించిపోతాడు– ఏం జెప్తున్న?"

"గట్లనేసార్–" శంకర్‌దాదా కార్లో వెళ్ళిపోయాడు.

రాములు బయటికెళ్ళ బోతూ మమ్మల్ని చూసి ఆగిపోయాడు.

"మళ్ళీ ఈడకొచ్చిన్రేమి సంగతి? ఆ స్పీకర్స్ కిరికిరి గురించేనా?"

"అవును– " చెప్పాడు రంగారెడ్డి.

"ఆర్నియవ్వ– మీరెక్కడ లఫంగ్‌గాంగ్ దొరికిన్రు రా భయ్! మీకు దేవుడిమీద భక్తిగిట్ట లేదా ఏంది?"

"ఆ చెత్త రికార్డులు పెట్టటమే భక్తి అయితే– లేదు."

"ఇగో– మీకు మంచిగచెప్తున్నా, ఇంకొక్కసారి మైక్‌గురించిఎవరికయినా కంప్లెయింట్ చేసిన్రో మంచిగుండది! పోలీసోళ్ళేం చేస్తారువయ్యా? మైక్ గుంజుకు పోతరా? ఆళ్ళకంత దమ్ములున్నాయ్? ఇగో– ఈ ఇనిస్పెక్టర్ కాదు– కమీషనరు అయినగాని ఏమీ చేయ్యలేరు! సమజైనాది? ఎమ్మెల్యేకి ఎదురు మాట్లాడానికి యెవరికయా ధైర్యం ఉన్నది?"

మేము బయటికొచ్చేశాము.

"ఇప్పుడేం చేద్దాం!" అడిగాడు గోపాల్రావ్

"మినిష్టరుగారి దగ్గరకెళ్దాం. ఏమయినాసరే దీని అంతు తేల్చుకోవాలి...." అన్నాడు శాయిరామ్.

అందరం మినిష్టరు గారింటికి చేరుకున్నాం.

బయట ఓ వ్యక్తి కూర్చుని ఉన్నాడు.

"ఎవరు మీరు? ఏం కావాలి?"

"మినిష్టరుగారితో మాట్లాడాలి"

"ఏ విషయం?"

"ఆయనతోనే చెప్తాం!"

"ఆయనతోనే మాట్లాడాలంటే వారం రోజులు ముందు అపాయింట్‌మెంట్ తీసుకోవాలి!" గత్యంతరం లేక వచ్చినపని బయటపెట్టాడు గోపాల్రావ్.

"సంగతేమిటంటే– మా ఇళ్ళ దగ్గర జరుగుతోన్న గణపతి నవరాత్రి ఉత్సవాల మైకులు చాలా న్యూసెన్స్‌గా ఉన్నాయి. ఎవ్వరికీ నిద్రలేదు. రాత్రింబగళ్ళు మోత! ఎవరికి చెప్పినా– ఆఖరికి రిపోర్ట్ చేసినా ఫలితం దొరకడం లేదు."

"అంటే మినిష్టరుగారిది ఇలా మైకులు గురించి ఫోన్లు చేసే ఉద్యోగం అనుకుంటున్నారా?"

"అహహ–అదికాదు–"

"ఇదిగో చూడండి! మీకు తెలీదనుకుంటాను. ఇవాళ ఈ మినిష్టరుగారే ఎనిమిది

చోట్ల విఘ్నేశ్వర పూజలకు హాజరవుతున్నారు. మరి ఆ మైకులు తీసేయమని వాళ్ళకు ఆయనెట్లా చెప్తారు? కొంచెమయినా మీకు కామన్‌సెన్స్‌లేకపోతే ఎలా?"

"అంటే మేమింకా ఈ నరకం భరించక తప్పదంటారు! అంతేనా!"

"మీ నరకం సంగతి మాకెందుకయ్యా! మా మినిష్టరుగారి పార్టీ కంటే బి.జె.పి. వాళ్ళు ఎక్కువ విగ్రహాలు పెట్టారని ఇప్పుడే మా మినిష్టరుగారికి తెలిసి నానా బాధాపడుతున్నారు. ఇప్పటికిప్పుడు ఇంకో పద్దెనిమిది వీధుల్లో విగ్రహాలు పెట్టి పూజలు ప్రారంభించాలని ఆయన పాపం పిచ్చికుక్కలాగా తిరుగుతున్నారు ఉదయం నుంచీ! ఇప్పుడు టైము ఒంటిగంటవుతున్నా ఇంతవరకూ ఒక్కపెగ్గుకూడా తాగలేదు. వినాయకుడి పూజంటే అంత భక్తి ఆయనకు- అవునూ! మీ కాలనీలోపల వినాయకుడి విగ్రహాలేమీ పెట్టరా?" ఆత్రుతగా అడిగాడతను.

"ఎందుకు?' భయంగా అడిగాడు శాయీరామ్.

"ఎందుకేమిటయ్యా! అర్జంటుగా ఇంకోపద్దెనిమిది చోట్ల విగ్రహాలు పెట్టాలని మినిష్టరుగారు స్థలాలకోసం తిరుతున్నారని చెప్పలే? మీ కాలనీలో కూడా ఒకటో రెండో పెట్టేస్తే సమస్య తీరిపోతుందాయనకు-"

మాకు భయం వేసింది.

మా కాలనీ లోపల విగ్రహం పెట్టలేదని తెలిసిందంటే తక్షణం రెండు విగ్రహాలు వచ్చేస్తాయి. నెమ్మదిగా పది అడుగుల దూరం వెనక్కునడచి అక్కడినుంచి వెనక్కు తిరిగి వేగంగా పరుగెత్తాము.

"ఏయ్- మీ కాలనీ అడ్రసిచ్చిపోండి! మిమ్మల్నే" అంటూ అతను అరుస్తున్నా వినిపించుకోలేదు. నీరసంగా కాలనీ చేరుకున్నాం.

అప్పటికే స్పీకర్స్‌లో పాటల ఉధృతం పెరిగిపోయింది.

"అంటే మన చావు మనమే ఛావాలన్నమాట?" పళ్ళుకొరుకుతూ అన్నాడు గోపాల్రావ్.

"ఇప్పుడేకాదు. మన డెమొక్రసీలో ఎప్పుడూ ఎవడి చావు వాడు చావవలసిందే" అన్నాడు రంగారెడ్డి.

ఎవరిళ్ళకు వాళ్ళు చేరుకున్నాం.

హఠాత్తుగా మూడోవేపునుంచి మరోస్పీకర్‌లో సినిమాపాటలు భయంకరమయిన శబ్దంతో వినిపించసాగాయ్. దీంతో అన్నివేపుల నుంచీ ముట్టడి ప్రారంభమయింది.

"వందనం- అభివందనం- నాంపల్లి స్టేషన్ కాడా రాజాలింగా- నీ అందమే ఒకనందనం- రాజాలింగా- రామరాజ్యం తీరుసూడు- శివాశంభులింగా- నిన్నకు రేపుకు సంధిగనిలచిన ఓ సుందరీ- లింగా- రామరాజ్యం తీరూఊడు- పాదాభివందనం-

శివాశంభులింగా– కన్నులు పొడిచిన చీకటిలో– తిందామంటే తిండీలేదు– అరే దీపపు వెలుగుల్లో– ఉదమంటే ఇల్లేలేదు– తీరని ఊహల రేవుల్లో– చేద్దామంటే కొలువూలేదు– తీరం చేరని పడవల్లో – పోదామైటే నెలవూలేదు– వస్తానని, నేను వస్తానని– గుక్కెడు గంజీ కరువైపోయే ఒక్కడి పెళ్ళాం బరువైపోయే తలపులు తలుపుకు తనువిచ్చీ, వలపుల గడపకు నడుమిచ్చీ– బీడాబిక్కిపొట్టలు కొట్టి– మేడలు కట్టే చీకిటి శెట్టి– ఎదురు చూచిన సారి, అభిసారిక, సారి వందనం – నాంపల్లిస్టేషన్‌కాడి రాజాలింగ– వందనం.....”

నేను ఇంట్లోకొచ్చి పడుకున్నాను. భోజనం కూడా చేయబుద్ధి కావటంలేదు. గుండెలమీద సమ్మెట పోట్లలా, చెవుల్లో హోరెత్తిపోతూ, శబ్దాలు! రాత్రితొమ్మిది– పది– పదకొండు– ఒంటిగంటా.

“హే కృష్ణా, ముకుందా, మురారీ, ఇదిగో తెల్లచీరా, ఇవిగో మల్లెపూలు, రెండూకావాలా? ఆ రెండూకావాలా? వందనం, అభివందనం నాంపల్లి స్టేషన్‌కాడా, సామజవరగమనా, సామజవరగమనా, ఇంటింటి రామాయణం, వింతమయిన ప్రేమాయణం, దూరాన దూరాన తారాదీపం, శంకరా, సూదిలో దారం, సందులోబేరం, సన్నయిరాగానికి ఈ చిన్నారి నాట్యానికి ఆడించు ఆడించు గానుగా, జననీ జన్మభూమిశ్చ, ఓ సుబ్బారావు, ఓ అప్పారావూ, సరిగమలు, లేపమంటావా, నన్నే లేపమంటావా, అంతవాడు అంతకు ఇంతై ఎంతో ఎదిగిపోయాడమ్మా, ఆగదు ఆగదు ఏ నిమిషము, ఆగితే సాగదు ఈ లోకము, పాలుకావాలా! పండుకావాలా?” మంచం మీదనుంచి హఠాత్తుగా లేచి కూర్చున్నాను.

అప్పుడే స్పీకర్ శబ్దాలు ఆగిపోవటంతో అంతా గాఢనిద్రలోకి జారిపోయారు. ఏదో పూనకం ఆవహించినట్లు బయటకు నడిచాను. ఎదురుగ్గా గొడ్డలి పట్టుకుని నిలబడి ఉన్నాడు యాదగిరి. అతని వెనుక పక్కన రంగారెడ్డి గడ్డపలుగు పట్టుకుని ఉన్నాడు. అతని వెనక గోపాల్రావ్ పారతో.

అందరూ నాలాగానే పూనకం పూనినట్లున్నారు. ఎవ్వరూ ఏమీ మాట్లాడుకోలేదు.

స్పీకర్స్‌లో పాటలన్నీ ఆగిపోయి భయంకరమయిని నిశ్శబద్దం తాండవిస్తోందా ప్రాంతమంతా! నిశ్శబ్దంగా నడవసాగాం అందరం.

మర్నాడు ఉదయం నాలుగ్గంటలకు మా కాలనీ చుట్టూ ఉన్న మూడు స్పీకర్స్ శబ్దాలు చేయలేదు. నేను ఎనిమిది గంటల వరకూ హాయిగా నిద్రపోతుంటే మా ఆవిడ పరుగుతో వచ్చి నిద్రలేపింది.

“చూశారా– ఎంత విచిత్రం జరిగిందో?” అడిగిందామె.

"ఏం జరిగింది?" కళ్ళు మూసుకునే అడిగాను.

"ఆరోడ్‌మీదున్న వినాయకుడి విగ్రహాలు రాత్రిమయమయిపోయాయట!"

"అలాగా?" ఏమీ తెలీనట్లు నవ్వాపుకుంటూ అడిగాను.

"ఇదేదో ఆ దేవుడిలీలే అని జనం తండోపతండాలుగా వచ్చి చూస్తున్నారు పావలా పావలా టికెట్ పెట్టారు ఈ ఉత్సవకమిటీవాళ్ళు."

నేను ఉలిక్కిపడిలేచి కూర్చున్నాను.

అప్పుడే ఓ గొంతు స్పీకర్‌లో వినబడుతోంది.

"అమ్మలారా– అయ్యలారా! అందరూ క్యూలోరండి! భగవంతుడు. తనంతట తాను మాయమయినా ప్రదేశం చూసి తరించండి" దాని వెనుకే మళ్ళా సినిమా పాటలు. నాకు నిజంగానే పిచ్చెక్కి నట్లయింది.

